



కొడంగల్‌లో ఏరువాక పౌర్ణమి వేడుకల్లో రైతులు

ఘనంగా ఏరువాక పౌర్ణమి

పాడి పశువులను ముస్తాబు చేసిన రైతులు



పెద్దేముల్: మంబాపూర్ గ్రామంలో ఎడ్లబండ్లను ఊరేగిస్తున్న రైతులు

జిల్లా వ్యాప్తంగా రైతులు బుధవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే పాడి పశువులను రంగులు, మెరుపు దండలతో అందంగా అలంకరించారు. అనంతరం తయారు చేసిన పిండి వంటలను పశువులకు తినిపించారు. ఆ తర్వాత ముస్తాబు చేసిన పశువులను ఊరేగించారు. వికారాబాద్ మున్సిపాలిటీ, మండల పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి, అనంతగిరిపల్లి, ధన్నారంతో పాటు మండల పరిధిలోని కోటాలగూడ, సిద్దులూరు, పులుమద్ది తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. అలాగే కొడంగల్ పట్టణంతో పాటు బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లో రైతులు కాడెడ్లను, బండ్లను, ట్రాక్టర్‌లను రంగులతో అలంకరించి ఊరేగింపు నిర్వహించారు.

-వికారాబాద్/కొడంగల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి)



మద్గుల్ చిట్టంపల్లి గ్రామంలో అందంగా అలంకరించిన ఎడ్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు

పండుగలా పాఠశాలలను ప్రారంభించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునఃప్రారంభం పండుగలా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బడి బాట, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ తదితర అంశాలపై మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య, నోటు పుస్తకాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో మరమ్మతు పనులు, కిచెన్ షెడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. పాఠశాలల్లో బియ్యాన్ని పరిశీలించి నాణ్యతతో కూడిన బియ్యాన్ని మాత్రమే వినియోగించాలని అధికారులకు సూచించారు. బడీడు పిల్లలందరిని పాఠశాలల్లో చేర్పించే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం.సుధీర్, విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, డీఆర్డీవో శ్రీనివాస్, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో జయసుధ, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలి

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో అర్హులైన మహిళా విద్యార్థులు 23 తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల ప్రవేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్‌కు సంబంధించిన డిగ్రీ మహిళా కళాశాల మొయినాబాద్ మండలం, తోలు కట్ట సమీపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కళాశాలలో బీఎస్సీ(ఎంపీసీఎస్, ఎంఎస్సీఎస్, బీజెడ్సీ, ఎంజెడ్సీ), బీకాం (బీఏ, సీఏ), బీఏ (హెచ్‌ఈపీ) కోర్సులలో ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీసీఓ సాయిలత, కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ విజయ కోట, అశోక్, డీఈవో రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

మోగిన బడి గంట!



పంపిణీకి సిద్ధంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం

బడి గంట మోగింది. వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందుబాటులో ఉండేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇంతవరకు జిల్లాకు లక్ష్యంలో 98శాతం 4,81,511 పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి. అలాగే 79,049 జతల యూనిఫాంను సిద్ధం చేశారు. జిల్లాలోని మొత్తం 1,062 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో 68,041 మంది విద్యార్థులు ఉండగా, 4,239 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అలాగే అన్ని కేటగిరిల్లో కలిపి 420 వరకు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిసింది.

పాఠశాల వేళలు

ప్రాథమిక: ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు

ఉన్నత: ఉదయం 9 నుంచి సాయంత్రం 4-15 గంటల వరకు

జిల్లాకు చేరిన 4,81,511 పాఠ్య పుస్తకాలు

రెడీగా 79,049 జతల యూనిఫాం

మౌలిక సదుపాయాల కల్పనలో మరో'సారీ'

సమస్యలతోనే కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం

జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లు 1,066

మొత్తం విద్యార్థుల సంఖ్య 68,041



మేడ్చల్ మండలం అత్వెల్లి ప్రభుత్వ పాఠశాలలో మామిడి తోరణాలతో స్వాగత ఏర్పాట్లు



వికారాబాద్/మేడ్చల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని ప్రకటించినా పరిస్థితి ఏమాత్రం మార్పు రాకపోవడం గమనార్హం. పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన మన ఊరు- మన బడి కార్యక్రమం తొలి విడతలో రూ.144 కోట్ల అంచనా వ్యయంతో 371 పాఠశాలను ఎంపిక చేసి పనులు చేపట్టగా, 62 పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలు కల్పించగా, మిగిలిన చోట్ల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. పనులు చేసినంత వరకు ఇంకా రూ.8 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో

మిగతా 8వ పేజీలో...

ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

విద్యార్థులకు ఉత్తమ బోధన మెలకువలపై ఉపాధ్యాయులకు 5 రోజుల పాటు వృత్యంతర శిక్షణా తరగతులు నిర్వహించారు. జిల్లాలో మూడు విడతల్లో నిర్వహించిన ఈ తరగతులకు జీహెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు అందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఉపాధ్యాయులు విద్యా బోధనలో అనుసరించాల్సిన విధానాలు, పాఠశాల నిర్వహణ తదితర అంశాలపై ఈ శిక్షణా తరగతుల్లో అవగాహన కల్పించారు.

సమాచారం

పీఎం బాల పురస్కార్‌కు దరఖాస్తు చేసుకోండి

వికారాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అర్హులైనవారు పీఎం బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి జయసుధ సూచించారు. క్రీడలు, నూతన ఆవిష్కరణలు, సామాజిక సేవ, కళలు, సంస్కృతి, పర్యావరణం, సైన్స్, టెక్నాలజీ తదితర అంశాల్లో ప్రతిభ కనబర్చిన 18 ఏళ్లలోపు బాలలు అవార్డుకు అర్హులన్నారు. జూలై 31లోపు ఏడబ్ల్యూఏఆర్‌డీఎస్.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు పంపాలని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

13నుంచి సదరం క్యాంపులు

వికారాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, వికారాబాద్ నందు అంగవైకల్యానికి సంబంధించి జూన్ 13, 19, 24, 25 తేదీల్లో, బుద్ధి మాంద్యం గలవారికి జూన్ 17, 18న చెవుడు, మూగ వారు 26న, అంధులకు 27న సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ప్రస్తుతం స్లాట్ బుక్ చేసుకున్న వారు మెసేజ్ / ఫోన్ ద్వారా పిలువబడిన వారు మాత్రమే క్యాంపులకు హాజరు కావాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గురుకుల ఆర్మీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కే.శ్రీలత తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్ ప్రిన్సిటన్ కళాశాల ప్రాంగణంలోని గురుకుల ఆర్మీ(భువనగిరి) కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి 23వ తేదీలోపు అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు కళాశాలలో సమర్పించాలని కోరారు. సందేహాలుంటే 7995010687, 7981199283 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అధ్వానం.. పంట కాలువలు!

ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం

చివరి పంట పొలాలకు అందని సాగునీరు

పలుచోట్ల శిథిలమైన కల్వర్టులు.. రాకపోకలకు తప్పని ఇబ్బందులు

ఘట్‌కేసర్ రూరల్, జూన్11(ఆంధ్రజ్యోతి): పాలకులు మారుతున్నా సాగునీటి కాల్వలు మాత్రం మరమ్మతులకు నోచుకోవడం లేదు. చెత్తాచెదారంతో నిండటంతో చివరి పంట పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండుతున్న దుస్థితి. ఘట్‌కేసర్ మండలం మూసీ పరీవాహక ప్రాంత గ్రామాలకు ప్రధాన సాగునీటి వనరు నారాయణరావు కాల్వ. ఇది ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. కాల్వపై ఉన్న కల్వర్టులు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. పీర్జాదీగూడ వద్ద చెక్ డ్యామ్ నిర్మాణం చేసి నారాయణరావు కాలువను

మిగతా 8వ పేజీలో...

చెత్తాచెదారంతో నిండిన నారాయణరావు కాలువ



తెనుగూడెం వద్ద గుర్రపుడెక్కతో నిండిన నారాయణరావు కాలువ

చివరి పొలాలకు నీరందడం లేదు



నారాయణరావు కాలువ పిచ్చి మొక్కలతో నిండటంతో నీరు ముందుకు సాగడంలేదు. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో చివరి పొలాలకు నీరందడం లేదు. రాత్రి సమయాలలో అప్పుడప్పుడు రసాయన వ్యర్థ జలాలను కాలువలో పారబోస్తున్నారు. ఇప్పటికైనా కాలువలోని చెట్లచెదారాన్ని తొలగించి సక్రమంగా సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలి.

-కె.ఉదయ్‌కుమార్‌రెడ్డి, రైతు ఎదులాబాద్

మురికివాడల నివాసితులకు ఇందిరమ్మ ఇళ్లు

» అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ భూములలో నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇచ్చేందుకు ఆయా స్లమ్స్‌ను గుర్తించి నివేదికలు ఇవ్వాలని అదనపు కలెక్టర్ రాధికా గుప్తా తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూములలోని మురికివాడలలో ఉన్న ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద వాటిని తిరిగి నిర్మించేందుకు స్థలాలను గుర్తింపునకు సమన్వయంతో పనిచేసి నివేదిక సమర్పించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయా కుటుంబాల సమ్మతితో నివేదికలు తయారు చేసి 13వ తేదీలోగా నివేదికలు అందించాలన్నారు. సర్వేలో ప్రజలను ఒప్పించడంలో స్థానిక నాయకులను భాగస్వాములను చేయాలన్నారు. భవిష్యత్తులో అన్ని మురికివాడల నివాసితులకు అన్ని సౌకర్యాలతో పాటు గౌరవప్రదమైన గృహాలను అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. సమావేశంలో జిల్లా హౌజింగ్ ఈఈ రమణమూర్తి, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

న్యాయమైన పరిహారానికి చర్యలు

» అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

» గ్రామసభను బహిష్కరించి ఆందోళన చేసిన భూనిర్వాసితులు

శామీర్‌పేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారి రోడ్డు విస్తరణలో ఇళ్లు, స్థలాలను కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారాన్ని చెల్లించేందుకు చర్యలను తీసుకుంటామని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతీ భరోసా ఇచ్చారు. తూంకుంట పరిధిలోని భూ నిర్వాసితులతో బుధవారం తూంకుంట మున్సిపల్ కార్యాలయం ఎదుట పునరావాస, పునరుపాధి కల్పనపై ప్రజాభిప్రాయ సేకరణకు తహసీల్దార్ యాదగిరిరెడ్డితో కలిసి గ్రామసభను నిర్వహించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లు, భూములు కోల్పోతున్న వారికి నష్టం జరగకుండా తగు పరిహారాన్ని అందజేస్తామన్నారు. కాగా, రహదారి విస్తరణలో ప్రభుత్వం న్యాయమైన చర్యలను తీసుకోవడం లేదని నిరసిస్తూ కొందరు నిర్వాసితులు గ్రామసభను బహిష్కరించి ఆందోళన చేశారు. గ్రామసభ నుంచి ర్యాలీగా వెళ్లి రాజీవ్ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. రోడ్డు విస్తరణ 300ల ఫీట్లకు కాకుండా కేవలం 150 ఫీట్లకే పరిమితం చేసి న్యాయమైన పరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న భూ నిర్వాసితులు

దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అకౌంటెంట్, ఏఎన్‌ఎం పోస్టులకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా డీఈవో రేణుకాదేవి సూచించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయం, ఆదర్శ పాఠశాలల్లో 6 అకౌంటెంట్, 3 ఏఎన్‌ఎం ఖాళీలను తాత్కాలిక కాంట్రాక్టు పద్ధతిలో మహిళా అభ్యర్థులు పనిచేయుటకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కేజీబీవీ దోమ, బషీరాబాద్, కోట్పల్లి, పెద్దేముల్, చౌడపూర్, బొంరాస్‌పేటలలో అకౌంటెంట్ పోస్టులు, కేజీబీవీ చౌడపూర్, నవాబుపేట, ఆదర్శ పాఠశాల ముజాహిద్‌పూర్ నందు ఏఎన్‌ఎం పోస్టుల ఖాళీలు ఉన్నాయని ఆమె తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారి వయస్సు 25 నుంచి 40 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 12 నుంచి 15 వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ప్రకటనలో పేర్కొన్నారు.

స్నేహితుడి బర్త్‌డేకు వెళ్లి.. రైలు పట్టాలపై శవమై..

బాలుడిని హత్య చేసి ఉండొచ్చని అనుమానాలు



6

అన్నదాతల చూపు.. సేంద్రియం వైపు

పంట పొలాలకు చెరువు మట్టి, జీవాల ఎరువు తరలింపు



6

దశాబ్దాల కల సాకారం.. గిరిజనుల ఆనందం

● మేడిగడ్డ-శంకర్ కొండ కత్వవాగుపై వంతెన నేడు ప్రారంభం..

ఆమనగల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ-శంకర్ కొండ రోడ్డులో కత్వవాగుపై వంతెన నిర్మాణం పూర్తయింది. దశాబ్దాల గిరిజనుల సాకారం కాబోతుంది. ఏళ్లకాలంగా వర్షాకాలంలో పలు తండాల గిరిజనులు పడుతున్న ఇబ్బందులు తొలగనున్నాయి. నిర్మాణం పూర్తైన వంతెన ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. గురువారం మేడిగడ్డ -శంకర్‌కొండ కత్వవాగుపై నిర్మించిన వంతెన ప్రారంభానికి పంచాయతీ రాజ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రారంభ కార్యక్రమానికి ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఉముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. ఈమేరకు వంతెన ప్రారంభోత్సవ ఏర్పాట్లను పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ అభిషేక్ బుధవారం పరిశీలించారు. కాగా, ఆమనగల్లు మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, గిరిజనులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ అనితా విజయ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, విజయ్‌రాథోడ్ కోరారు.

కేసారం ఓటర్లను చేవెళ్ల వార్డులో చేర్చాలి

● ఎమ్మెల్యే యాదయ్యను కోరిన గ్రామస్తులు

చేవెళ్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని కేసారం వార్డులో ఉన్న ఓటర్లను చేవెళ్ల వార్డులో కలపాలని ప్రజాప్రతినిధులు కోరారు. ఈమేరకు బుధవారం కేసారం మాజీ సర్పంచ్ కాసుల రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఎమ్మెల్యే కాలె యాదయ్య నివాసానికి వెళ్లి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 70 ఏళ్లుగా చేవెళ్లతో కేసారం గ్రామానికి మంచి అనుబంధం ఉందన్నారు. మున్సిపాలిటీలో భాగంగా తమ గ్రామం కేసారంను చేవెళ్లలోని వార్డులో కాకుండా మల్కాపూర్ వార్డులో కలుపుతామని అధికారులు చెప్పడం సరైన విధానం కాదన్నారు. కేసారం గ్రామంలోని 889 ఓటర్లను చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని వార్డులో కలపాలని ఎమ్మెల్యేను కోరారు. భౌగోళికంగా, నైసర్గికంగా చేవెళ్ల పట్టణంతో కేసారం కలిసి ఉందన్నారు. ఎమ్మెల్యే యాదయ్య గ్రామస్తులు డిమాండ్ మేరకు చేవెళ్లలోనే కేసారం ఉండేలా అధికారులకు ఆదేశాలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అన్నదాతల చూపు.. సేంద్రియ సాగు వైపు

దౌల్తాబాద్, జూన్11 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయ రంగంలో రసాయనిక ఎరువుల వాడకంతో భూమిలోని భూసారం దెబ్బతిని తెగుళ్ల సోకి దిగుబడులు రాక రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువుల వాడకంపై కొందరు రైతులు దృష్టిపెట్టారు. మండలంలో రైతులు తమ పంట పొలాల్లో ఇతర ప్రాంతాల నుంచి మండలానికి పశువులను తీసుకొని మేత కోసం వచ్చే పశువుల పెంపకం దారులతో మాట్లాడి తమ పొలాల్లో మేకలు, గొర్రెల మందలు ఉండేలా చూస్తున్నారు. అదే విధంగా కొందరు రైతులు ఈ ప్రాంతంలోని పశువుల పెంపకందారుల వద్ద ఎరువు కొనుగోలు చేస్తూ పొలాల్లో చల్లుతున్నారు.


దేవరఫస్లాబాద్‌లో పంట పొలంలో రైతు వేసిన చెరువు మట్టి

పొలాలకు చెరువు మట్టి

రైతులు తమ పంట పొలాల్లో ఆయా గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటల మట్టిని సైతం ట్రాక్టర్ల సాయంతో తరలిస్తున్నారు. నల్ల రేగడి మట్టి, పత్తి, కంది పంటలకు అనుకూలంగా ఉండటంతో మండలంలోని గోకఫస్లాబాద్, దేవరఫస్లాబాద్, బాలంపేట్, గుండెపల్లి తదితర గ్రామాల్లో వేసుకుంటున్నారు. సేంద్రియ ఎరువులతో పంట దిగుబడి ఎక్కువగా వస్తుండటంతో పాటు ఒక సంవత్సరం ఎరువు వేస్తే మూడు సంవత్సరాల వరకు పని చేస్తుండటంతో రైతులు ఎక్కువగా మేకలు, గొర్రెల ఎరువులను వాడటంపై ఆసక్తి కనబరుస్తున్నారు. సేంద్రియ ఎరువు ట్రాక్టర్ రూ.1500వరకు, అదే విధంగా సంవత్సరం లోపు కుప్ప దాదాపు రూ.15వేల వరకు గ్రామాల్లో అందుబాటులో ఉంటుంది.

భూమి సారవంతం

సేంద్రియ ఎరువుల వాడకంతో భూమి సారవంతం అవుతుంది. పంట దిగుబడి సైతం పెరుగుతుంది. సేంద్రియ ఎరువు ఒక్కసారి వేస్తే పంటలకు ఉపయోగకరంగా ఉంటుంది. రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించాలి.

- వెంకటప్ప, రైతు, దేవరఫస్లాబాద్


ఏసీపీ కిషన్‌కు చెక్కు ఇస్తున్న మాజీ జెడ్పీటీసీ మాలతీకృష్ణారెడ్డి

సీసీ కెమెరాల ఏర్పాటుకు భారీ విరాళం

చేవెళ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకంగా పని చేస్తాయని చేవెళ్ల ఏసీపీ కిషన్ తెలిపారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని పద్మావతి కన్వెన్షన్‌లో ఏసీపీ కిషన్, సీఐ భూపాల్ శ్రీధర్‌లకు చేవెళ్ల మాజీ జెడ్పీటీసీ మర్పల్లి మాలతీ కృష్ణారెడ్డి సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.16 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ చేవెళ్ల మున్సిపాలిటీ పట్టణ కేంద్రంతోపాటు అన్ని వార్డులు, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు మాజీ జెడ్పీటీసీ మాలతీ కృష్ణారెడ్డి ముందుకురావడం అభినందనీయమన్నారు. మల్కాపూర్ గేట్ నుంచి బీజాపూర్ రహదారిపై దామరిగిద్ద గేట్, వరకు, షాబాద్ చౌరస్తా మీదుగా దేవుని ఎర్రవల్లి గేట్ వరకు శంకర్‌పల్లి రోడ్డుపై కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జె.లక్ష్మారెడ్డి, మల్లారెడ్డిగూడ మాజీ సర్పంచ్ ఎం.మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రాములు, రవీందర్‌రెడ్డి, పీపీసీఎస్ డైరెక్టర్ ఎన్.కృష్ణారెడ్డి, నాయకులు మల్లారెడ్డి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

కద్తాల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల వయస్సు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సీడీపీవో శాంతిరేఖ తెలిపారు. ప్రాజెక్ట్ పరిధిలో ఈనెల 10 నుంచి 17 వరకు అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో పలు కాలనీల్లో పర్యటించి మూడేళ్లలోపు చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. ఎంపీడీవో సుజాత, సీడీపీవో సుజాతలు పాల్గొని అవగాహన కల్పించారు.ఐసీడీఎస్ సూపర్‌వైజ్ శబరి, ఏఎన్ఎం పుష్ప, కార్యదర్శి అల్లాజీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


చిన్నారులకు అడ్మిషన్ పత్రాలు ఇస్తున్న సీడీపీవో శాంతిరేఖ

మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దు


లోక్ అదాలత్‌లో రిటైర్డ్ జడ్జి లక్ష్మణ్ తదితరులు

చేవెళ్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు డ్రైవ్ చేయొద్దని రిటైర్డ్ జడ్జి కె.లక్ష్మణ్ అన్నారు. బుధవారం చేవెళ్ల మున్సిఫ్ కోర్టు ఆవరణలో చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌ల ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. రిటైర్డ్ జడ్జి కె.లక్ష్మణ్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను నడిపితే చట్టపరంగా నేరం అవుతుందన్నారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మొత్తం 76 కేసులు పరిష్కరించి రూ.1,57,500 జరిమనా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఏఎస్సై చందర్‌నాయక్, ట్రాఫిక్ పోలీస్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

స్నేహితుడి బర్త్‌డేకు వెళ్లి
రైలు పట్టాలపై శవమై..

●బాలుడిని హత్య చేసి ఉండొచ్చని అనుమానాలు

బషీరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి బర్త్‌డే పార్టీ కోసం వెళ్లిన ఓ బాలుడు అనుమానాస్పద స్థితిలో కర్ణాటక రాష్ట్రం సేడం రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టాలపై బుధవారం శవమై కనిపించాడు. ఈ సంఘటన బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామంలో కలకలం రేపుతోంది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మైల్వార్ గ్రామానికి చెందిన అంజమ్మ కుమారుడు శాంతుకుమార్(16) గతంలో రెండు సార్లు పదో తరగతి ఫెయిల్ కాగా, ఇటీవల పరీక్ష రాశాడు. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన స్నేహితుడితో పాటు, సమీపంలోని కంసాన్‌పల్లి(బి) గ్రామానికి చెందిన మరి కొందరి స్నేహితులను కలిసి ఆ గ్రామానికి చెందిన మరో మిత్రుడి బర్త్‌డే ఏర్పాట్లలో మునిగినట్లు తెలుస్తోంది. సాయంత్రం వరకు పరిసరాల్లో స్నేహితులతో కలిసి మోటార్ బైక్‌పై తిరిగిన శాంతుకుమార్ రాత్రికి ఇంటికి రాలేదు. అయితే ఆ రాత్రి స్నేహితులతో కలిసి గ్రామ సరిహద్దు ప్రాంతమైన కర్ణాటకలోని హస్నాబాద్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఏం జరిగిందో కానీ సేడం రైల్వేస్టేషన్ వద్ద పట్టాలపై శాంతుకుమార్ శవమై కనిపించాడు. బుధవారం ఉదయం రైల్వే సిబ్బంది మృతదేహాన్ని గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు మృతుడి వద్ద సెల్‌ఫోన్ ఆధారంగా ఫోన్ చేయగా మైల్వార్‌లోని తల్లికి సమాచారం తెలిసింది. వెంటనే గ్రామ పెద్దలతో కలిసి తల్లి అంజమ్మ, సమీప బంధువులు ఘటన జరిగిన ప్రాంతం వద్దకు వెళ్లారు. స్నేహితులతో కలిసి వెళ్లిన శాంతుకుమార్ కర్ణాటక ప్రాంతంలో అనుమానస్పదంగా శవమై కనిపించడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్నేహితుల మధ్య ఎదైనా గొడవ జరిగి శాంతుకుమార్‌ను హత్య చేశారా? అనంతరం రైల్వే ప్రమాదంగా చిత్రీకరించేందుకు పట్టాలపై పడేశారా? అన్న కోణంలో అక్కడి పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. మృతుడి తలకు బలమైన రక్త గాయమైనట్లుగా కుటుంబీకులు వాపోతున్నారు. సేడం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం గుల్బర్గా జిల్లా కేంద్రం మార్చురీకి మృతదేహాన్ని తరలించారు. కాగా రైల్వే పోలీసులు, స్థానిక సివిల్ పోలీసుల సమన్వయంతో ఘటన స్థలానికి డాగ్ స్క్వాడ్‌ను రప్పించి విచారించినట్లు సమాచారం. అయితే మృతుడు శాంతుకుమార్ మోటార్‌బైకు కూడా ఘటన స్థలం వద్ద కనిపించలేదని సంబంధీకులు తెలిపారు. మృతుడు శాంతుకుమార్ తండ్రిమున్యప్ప మూడునెలల కిందట మృతి చెందాడు.


శాంతుకుమార్ (ఫైల్)

పాఠశాల స్థలాన్ని రక్షించాలి

కద్తాల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల భూములను రక్షించాలని ప్రభుత్వాన్ని ప్రధానోపాధ్యాయుడు జంగయ్య కోరారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ ముంతాజ్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. సర్వేనెంబర్ 65/1, 65/2 సుమారు 3 ఎకరాల భూమి ఉంది. పాఠశాల స్థలాన్ని గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. స్థలాన్ని పరిశీలించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తామని తహసీల్దార్ తెలిపినట్లు జంగయ్య పేర్కొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న హెచ్ఎం జంగయ్య



విద్యార్థులను అభినందిస్తున్న సుధీర్

విద్యార్థులను అభినందించిన అదనపు కలెక్టర్

వికారాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి):2025-26 విద్యా సంవత్సరానికి వాటర్ స్పోర్ట్స్ అకాడమీ(క్రీడా పాఠశాలలో) కాయకింగ్, కేనోయింగ్, ఫెన్సింగ్ మొదలైన క్రీడల్లో అడ్మిషన్లకు జిల్లా నుంచి ఎంపికైన 9 మంది ఎస్టీ విద్యార్థులను అదనపు కలెక్టర్ సుధీర్ అభినందించారు. చదువుతో పాటు క్రీడలో శిక్షణ పొంది వాటర్ స్పోర్ట్స్‌లో జాతీయ స్థాయిలో బహుమతులు గెలవాలని ఆకాంక్షించారు. టీటీడీవో కమలాకర్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాదిగలు అన్ని రంగాల్లో రాణించాలి

షాద్‌నగర్ రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మాదిగలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఎస్సీ వర్గీకరణ సాధ్యమైనట్లు తెలిపారు. వర్గీకరణ ఫలాలు అందరికీ అందుతాయన్నారు. పిల్లలకు చదువు ముఖ్యమని.. భవిష్యత్తులో అదే ఆస్తి అని అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింలు, నాయకులు పాండు, కృష్ణ, లింగం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): యువత సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొని తమ వంతు సేవలందించాలని గురునానక్ యూనివర్సిటీ రెక్టార్ డా.కలైరాసన్ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని గురునానక్ విద్యాసంస్థల్లో స్కూల్ ఆఫ్ ఫార్మసీ, గురునానక్ హోమియోపతి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్, తెలంగాణ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా బుధవారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 400 మందికిపైగా విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ అసోసియేట్ డైరెక్టర్ డా.రషీద్ హరూన్, హోమియోపతి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.రేణుక, గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ జీఎస్ కోహ్లీ, మేనేజింగ్ డైరెక్టర్ డా.హెచ్.ఎస్ సైనీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

కేశంపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతకుంటపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 98లో మూడెకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని.. కబ్జాదారుల నుంచి కాపాడాలని గ్రామస్థులు బుధవారం డీటీ గీతకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై 10 రోజుల క్రితం ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలం కబ్జాకు సహకారం అందించిన కాంగ్రెస్ నాయకుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, విచారణ నిమిత్తం ఆర్ఐని పంపినట్లు డీటీ వివరించారు. గ్రామ యువకుల పోచమోని రమేష్, పల్లెమోని నవీన్, నరేష్, వినోద్, మల్లేష్ యాదవ్, కుమ్మరి రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొమురయ్య

యోగా డేను ఘనంగా నిర్వహించాలి

కేశంపేట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న యోగా డేను ఘనంగా నిర్వహించాలని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ కొమురయ్య పిలుపునిచ్చారు. బుధవారం బీజేపీ మండలాధ్యక్షురాలు రొల్లు రాధిక ఆధ్వర్యంలో కేశంపేట మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొమురయ్య హాజరై మాట్లాడారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఈ నెల 23న తల్లికి వందనం పేరిట ప్రతీ బూత్‌లో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రొల్లు రఘురాములు గౌడ్, మోటే శ్రీనివాస్, మధుసూదన్ గౌడ్, నరసింహ, వెంకటేష్, శ్రీనివాస్, కర్రెడ్ల నరేందర్‌రెడ్డి, రమేష్, నరేష్, నర్సింగ్, మహేష్, భక్తవత్సల, తదితరులు పాల్గొన్నారు.



ఎంపీవోకు వినతి పత్రం ఇస్తున్న కార్యదర్శులు

జీపీల్లో ఆర్థిక ఇబ్బందులు తొలగించాలి

చేవెళ్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో సరిపడా నిధులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే సమస్యలు పరిష్కరించాలని మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం మండలంలోని 25 గ్రామ పంచాయతీ కార్యదర్శులందరూ కలిసి తమ గ్రామ పంచాయతీలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని చేవెళ్ల ఎంపీవో విఠలేశ్వర్‌కు వినతి పత్రం అందించారు. కార్యదర్శులు శివ, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, శివ కుమార్, శ్రీనివాస్, కరుణాకర్, రాజ్‌కుమార్ , భాస్కర్, దేవాదాస్, నరేందర్‌లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో కొన్ని నెలలుగా ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు.

పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి

యాచారం/చౌదరిగూడ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు యాచారం మండలం నానక్‌నగర్‌లో బుధవారం పలు కాలనీల్లో ర్యాలీలు నిర్వహించారు. ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించాలని గ్రామస్థులకు సూచించారు. సీడీపీవో వినితాదేవి, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం మోహన్, తదితరులున్నారు. రెండున్నరేళ్లు నిండిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జోత్స్న తెలిపారు. కొందుర్గు, మండల పరిధిలోని ఉత్తరాస్‌పల్లి, భైరంపల్లి, పులుసుమామిడి, సోమారంపహాడ్, జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని తుమ్మలపల్లి, లచ్చంపేట్ తదితర గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలో అమ్మమాట.. అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.

నిలిచిన బర్త్ సర్టిఫికెట్ల జారీ

- ఐదు రోజులుగా ఆగిన సేవలు

తాండూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): జనన, మరణాల ధ్రువీకరణ పత్రాల జారీ నిలిచింది. ఐదు రోజులుగా సేవలు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపాలిటీల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీలో వెబ్‌సైట్‌లో సమస్యలు తలెత్తాయి. మీసేవ కేంద్రాల్లో రెండు రోజులుగా సమస్యలు వస్తున్నాయి. పాఠశాలల్లో చేరేందుకు, ఉన్నత విద్యకు, ఆధార్‌కార్డుకు బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి కావ డంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అలాగే డెత్ సర్టిఫికెట్లు కూడా జారీ కావడం లేదు. మున్సిపాలిటీలో 100కుపైగా బర్త్, 50వరకు డెత్ సర్టిఫికెట్ల జారీ నిలిచింది. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ మున్సిపాలిటీల్లోనూ సేవలు నిలిచాయి. కొన్నింటికి గడువు కూడా దాటింది. ప్రజలు సర్టిఫికెట్ల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు స్పందిస్తూ రాష్ట్రస్థాయిలోనే సర్వర్ డౌన్ ఉందని, ఒకటెండ్రు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని చెబుతున్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత, ఉపాధి కల్పనకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేసిందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ మైనార్టీ మహిళా శక్తి పథకం కింద ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలోని 167 మంది మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు మంజూరైనట్లు తెలిపారు. బుధవారం ఆమనగల్లులో విలేకరులతో మాట్లాడుతూ మంజూరైన కుట్టు కిషన్లను గురువారం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. తలకొండపల్లి, కడ్తాల్, ఆమనగల్లు మండలాలకు చెందిన 45 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ-శంకర్ కొండ కత్వవాగుపై రూ.3.10 కోట్లతో నిర్మించిన వంతెనను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రూ. 500 కోట్లతో నియోజకవర్గంలో రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ అనితావిజయ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, కేఎన్ఆర్ యువసేన నాయకుడు బాబా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మానయ్య తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం సీఐపై చర్యలు తీసుకోవాలి

- నాగారం ముస్లిం నాయకులు
- యువకులపై తప్పుడు కేసులు పెట్టారని ఆరోపణ
- బీఆర్ఎస్ పార్టీకి మూకుమ్మడి రాజీనామాకు సిద్ధం!



మాట్లాడుతున్న ముస్లిం నాయకులు

మహేశ్వరం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): హిందూ-ముస్లింలు ప్రశాంతంగా జీవిస్తున్న నాగారం గ్రామంలో కొందరు బీజేపీ నాయకులు మత ఘర్షణలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని, అందులో భాగంగానే సోషల్‌మీడియా వేదికగా కొందరు ముస్లిం యువకులను మహేశ్వరం పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారని.. అక్రమ కేసులు బనాయించిన సీఐపై చర్యలు తీసుకోవాలని నాగారం ముస్లిం సొసైటీ నాయకులు లతీఫ్‌ఖాన్, కమాల్‌ఖాన్, షాఫుద్దీన్, ఉస్మాన్‌లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గ్రామంలో సమావేశమై మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా గ్రామంలో ఎద్దును కోసుకోవడంతో దాన్ని కొందరు బీజేపీ నాయకులు గోమాతగా వక్రీకరించారని, ముస్లింలు గోమాతను కోశారని తప్పుడు ప్రచారం చేయడంతో పాటు కొందరు ముస్లిం యువకులపై కేసులు పెట్టి జైలుకు పంపారన్నారు. గ్రామంలో కోసింది గోమాత కాదని.. ఎద్దు అని సాక్ష్యాధారాలు చూపించినా మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు ఏకపక్షంగా వ్యవహరిస్తూ ముస్లిం యువకులపై కేసులు నమోదు చేశారన్నారు. ఈ విషయంలో ముస్లిం మతస్తులను పరుష పదజాలంలో దూషించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే తీసుకోకుండా.. తమ పైనే కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, సీఐపై తగిన చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులను కలుస్తామన్నారు. అదేవిధంగా నాగారంలోని ముస్లింలందరూ దాదాపుగా బీఆర్ఎస్ పార్టీకి చెందినవారమేనని.. అయినా మా బాధలు ఏ ఒక్క బీఆర్ఎస్ నాయకుడు, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి పట్టించుకోలేదని.. అందుకు మేమందరం మూకుమ్మడిగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడానికి సిద్ధమయ్యామన్నారు. మహేశ్వరం సీఐపై తగిన చర్యలు తీసుకునేలా త్వరలో రాచకొండ కమిషనర్‌ను కలువనున్నట్లు తెలిపారు. నాయకులు ఇబ్రహీం, ఫిరోజ్‌ఖాన్, అహ్మద్, నసీర్, ఇమ్రాన్‌ఖాన్, మహ్మద్, చాంద్‌పాషా, అన్వర్‌ఖాన్, అమీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'జయపురి లేఅవుట్‌పై న్యాయ పోరాటం'

ఘట్‌కేసర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పరిధి జయపురి కాలనీ భూ వివాదంపై పోరాడుతున్న తనను మీడియా పేరుతో ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలని ఘట్‌కేసర్ సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సర్వే నంబర్లు 559, 563, 564, 565, 566లలోని 68ఎకరాల భూమిని 1968లో ముస్లింల నుంచి నర్సింహరావు, చంద్రశేఖర్‌లు ఎన్‌రావుఅండ్‌రావు కంపెనీకి అప్పగించారన్నారు. 56 ఎకరాలను 1969లో లేఅవుట్ చేశారని చెప్పారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ప్లాట్లు అమ్ముడుపోవడం లేదని తిరిగి సాగు భూమిగా మార్చి చంద్రశేఖర్ 21.23ఎకరాలు, నర్సింహరావు 21.23 ఎకరాలను పట్టా చేసుకున్నారని తెలిపారు. చంద్రశేఖర్ తన భమిని, నర్సింహరావు భూమిని భగవాన్‌కు అగ్రిమెంట్ చేశాడన్నారు. దీంతో నర్సింహరావు 2003లో ఇన్‌జంక్షన్ ఆర్డర్ తేగా 2005లో ఆర్డర్ వెకేట్ అయ్యిందన్నారు. అయినా చంద్రశేఖర్, భగవాన్‌లు ప్లాట్లు విక్రయిస్తున్నారని తెలిపారు. తాను నర్సింహరావు తరఫున పోరాటం సాగిస్తుంటే సోమయ్య, రామారావు మీడియా ప్రతినిధుల పేటిర బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తాము న్యాయపోరాటం చేస్తామన్నారు.



యూరియా కోసం క్యూలో రైతులు

యూరియా కోసం రైతుల ఇబ్బందులు

మర్పల్లి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వానకాలం ప్రారంభంలోనే యూరియా కొరతతో రైతులు ఇబ్బందిపడుతున్నారు. మండలానికి పూర్తిస్థాయిలో యూరియా సరఫరా కావడం లేదు. మనగ్రోమోర్ 120క్వింటాళ్ల యూరియా రాగా బుధవారం రైతులు కొనుగోలు చేశారు. ఎకరాకు ఒక్క బస్తనే ఇస్తున్నారు. అది సరిపోదని మూడు బస్తాలైనా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఎకరానికి ఒక్క బస్తా కంటే ఎక్కువ ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. ఫర్టిలైజర్స్ నిర్వాహకులు బ్లాక్‌లో అమ్మేసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి



వికారాబాద్ పట్టణ బీజేపీ కార్యవర్గం

వికారాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): 11ఏళ్లలో నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించే బాధ్యత ప్రతీ బీజేపీ కార్యకర్తపై పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్‌లో పట్టణ అధ్యక్షురాలు యాస్కి. శిరీష ఆధ్వర్యంలో కార్యవర్గాన్నా ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. కార్యవర్గం సమష్టిగా కృషిచేసి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వికారాబాద్‌లో స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యక్షులు బక్క విజయలక్ష్మి, అశోక్‌కుమార్, లక్ష్మారెడ్డి, భాస్కరచారి, ప్రధాన కార్యదర్శులు ఉప్పు అమర్‌నాథ్, వెంకట్, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, వినోద్, సువాని, బాలలింగం, ప్రీతంగౌడ్, కోశాధికారి మామిడి రాంమోహన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కేపీ రాజు, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి, సతీష్, నరోత్తంరెడ్డి, శ్రీకాంత్, చరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మోదీ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): 11ఏళ్ల ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కేంద్రం పెట్టుబడి వ్యయాన్ని భారీగా పెంచిందన్నారు. రోడ్లు, ఓడరేవులు, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారని అన్నారు. దేశంలో 59వేల కిలోమీటర్ల రోడ్లు, 37,500 కిలోమీటర్ల రైల్వే లైన్ల నిర్మాణాన్ని పూర్తి చేశారని వివరించారు. దేశంలో 141కోట్ల మందికి ఆధార్‌కార్డులు జారీ అయ్యాయని తెలిపారు. రోజూ 60కోట్ల యూపీఐ లావాదేవీలు జగుతున్నాయంటే సాంకేతిక రంగంలో దేశం ఎంత వేగంగా ముందుకు వెళ్తోందో తెలుస్తోందన్నారు.

మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి సూపరింటెండెంట్ పోస్ట్

తాండూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): తాండూరు జిల్లా ఆస్పత్రికి, మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి సూపరింటెండెంట్లను నియమిస్తూ వైద్య విధాన పరిషత్ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి గత సూపరిండెంట్ డాక్టర్ రవిశంకర్ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో కొత్తగా ఆర్థోసివిల్ సర్జన్ జి.వినయ్‌ను సూపరిండెంట్‌గా నియమించారు. అయితే మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి, జిల్లా ఆస్పత్రికి ఒక్క సూపరింటెండెంటే ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి కూడా గైనిక్ సివిల్ సర్జన్ డాక్టర్ సునీతను సూపరింటెండెంట్‌గా నియమించారు. కాగా రెండు ఆస్పత్రులకూ ఇప్పటికే ఆర్ఎంఓలు ఉన్నారు. జిల్లా ఆస్పత్రికి ఆర్ఎంవోగా ఆనంద్‌కుమార్‌రెడ్డి, మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆర్ఎంఓగా అనిల్‌కుమార్ ఉన్నారు.



పల్లకీసేవలో కర్ణాటక మాజీ మంత్రి అరవింద లింబావళి

ముగిసిన కొత్లాపూర్ ఎల్లమ్మ జాతర

తాండూరు రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కొత్లాపూర్‌లో రేణుక ఎల్లమ్మ జాతర ముగిసింది. మే 12న ప్రారంభమైన జాతర బుధవారం ముగిసింది. మంగళవారాలు, శుక్రవారాల్లో భక్తులు వేలాదిగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం పునర్నిర్మాణ దాత, కర్ణాటక మాజీ మంత్రి అరవింద లింబావళి దంపతులు పూజా కార్యక్రమాలు జరిపించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కూడా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ప్రధానంగా గుల్బర్గ, బీదర్, సంగారెడ్డి, హైదరాబాద్, చించెల్లి ప్రాంతాల నుంచి భక్తులు తరలొచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఈవో శేఖర్‌గౌడ్, పూజారి శ్రీనివాస్, రవి పర్యవేక్షించారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి అవాంఛనీయ సంఘటనలు సిబ్బందిని నియమించారు. నాయకులు సందీప్‌రెడ్డి, బస్సురెడ్డి, సాయిలు, గోపాల్, వెంకట్‌రాంరెడ్డి, జయదీప్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, బైండ్ల రాజు, లాలయ్యగౌడ్, లల్లానాయక్, శాంతప్ప, చెవిటి లక్ష్మ, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి



ఎరువులు కొన్న రైతులకు రశీదు ఇవ్వాలి



పెద్దేముల్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ

పెద్దేముల్/యాలాల, జూన్11(ఆంధ్రజ్యోతి): ఎరువులు, మందులు కొనుగోలు చేసిన రైతులకు దుకాణదారులు బిల్లులు తప్పక ఇవ్వాలని ఏడీఏ రుద్రమూర్తి తెలిపారు. లైసెన్స్ నంబర్ కలిగిన బిల్లులే ఇవ్వాలని చెప్పారు. పెద్దేముల్ రైతువేదికలో బుధవారం విత్తన, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. అంతకు ముందు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతలకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. దుకాణం వద్ద స్టాక్‌బోర్డు పెట్టాలని ఏవో పవన్‌ప్రీతమ్ తెలిపారు. యాలాల రైతు వేదికలో ఏడీఏ మాట్లాడుతూ.. ఎమ్మార్పీ ధరలకంటే ఎక్కువ రేటుకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవో శ్వేతారాణి మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలే విక్రయించాలని సూచించారు.

మరియా ఫీడ్ కంపెనీ సీజ్

ధారూరు, జూన్11(ఆంధ్రజ్యోతి): దోర్నాలలో ఉన్న మరియా ఫీడ్ కంపెనీని బుధవారం తహసీల్దార్ సాజీదాబేగం సీజ్ చేశారు. ఈ కంపెనీలో ఎముకలతో నూనె తయారీ చేస్తున్నారని మంగళవారం గ్రామస్తులు ఆందోళన చేశారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారుల నివేదిక వచ్చేంత కంపెనీ నడపొద్దని చెప్పారు. కార్యక్రమంలో డీటీ విజయేందర్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పదిశాతం ఇళ్లను స్థానికులకు కేటాయించాలి



మాట్లాడుతున్న కౌకుంట్ల చంద్రారెడ్డి

కీసర రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాంపల్లిలో కట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో 10శాతం స్థానికులకు ఇవ్వాలని మున్సిపల్ మాజీచైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నాగారంలో మాట్లాడుతూ.. రాపంల్లిలో చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన సమయంలో స్థానికులకు పది శాతం కేటాయిస్తామని అప్పటి మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఇవ్వకపోవడంతో కోర్టును ఆశ్రయించామని తెలిపారు. రాంపల్లిలో నర్మించిన 6,200 ఇళ్లల్లో 620 స్థానికులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన పౌర సరఫరాల శాఖ అధికారి వెంకట్‌రెడ్డి

ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలి

కీసర, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పౌర సరఫరాశాల అధికారి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం కీసర ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. వచ్చే శుక్రవారం లోపు కొనుగోళ్లను అప్‌డేట్ చేయాలన్నారు. వానాకాలం వచ్చినందును వారంలోగా కొనుగోళ్లను పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు 34వేల బస్తాల కొని 171మంది రైతులకు డబ్బు బదిలీ చేశామని కేంద్రం నిర్వహకులు వెంటకరెడ్డికి తెలిపారు. ఆయనతో సొసైటీ చైర్మన్ ప్రభాకరరెడ్డి, సిబ్బంది నరహరి, మహ్మద్ ఉన్నారు.

మైల్వార్ రోడ్డుకు మహర్దశ

- రూ.38లక్షలతో డబుల్ రోడ్డు నిర్మాణం



కొనసాగుతున్న బషీరాబాద్-మైల్వార్ డబుల్ రోడ్డు పనులు

బషీరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్-మైల్వార్ ఆర్అండ్‌బీ డబుల్ రోడ్డు విస్తరణ పనులు ముమ్మరమయ్యాయి. యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ నుంచి వెళ్తున్న జాతీయ రహదారిని అనుసంధానిస్తూ బషీరాబాద్ వరకు నాలుగు లేన్ల రోడ్డును మైల్వార్ వరకు విస్తరిస్తున్నారు. రోడ్డు వెడల్పుతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లూ సింగిల్ రోడ్డుతో ఇబ్బందులకు గురవుతున్నాయని, విస్తరణతో ఇబ్బందులు తీరడంతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. రోడ్డుకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



గురుదోట్లలో ప్రదర్శన చేస్తున్న శాస్త్రవేత్తలు, స్థానికులు

విత్తనశుద్ధి చేసుకునే విత్తుకోవాలి

ధారూరు, జూన్11(ఆంధ్రజ్యోతి): విత్తనశుద్ధి చేసిన తర్వాతనే విత్తుకోవాలని నూనె గింజల పరిశోధన సంస్థ శాస్త్రవేత్త అలివేలు తెలిపారు. బుధవారం గురుదోట్ల, అంపల్లిల్లో విత్తనశుద్ధిపై రైతులకు అవగహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. ట్రైకోడెర్మా 10 గ్రాముల మందును కిలో విత్తనాలకు కలపాలన్నారు. రైజోబియం భూమిలో కలపడం వల్ల భూమిసారం పెరుగుతుందని శాస్త్రవేత్త శంకరిమీనా తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషాకిరణ్, డాక్టర్ పుష్ప, ఝాన్సీ, పూజిత, రైతులు పాల్గొన్నారు.

కుప్పన్‌కోట్ తండాలో తాగునీటి కష్టాలు


బోరు వద్ద నీరు పట్టుకుంటున్న గిరిజనులు

బషీరాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కుప్పన్‌కోట్‌తండా పంచాయతీలో గిరిజనులు తాగునీటి కష్టాలు పడుతున్నారు. ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంక్ బోరు మరమ్మతుకు గురవడంతో నీటి ఇబ్బందులు అధికమయ్యాయి. తండాలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని గిరిజనులు తెలిపారు. డైరెక్టు పంపింగ్ సిస్టం బోర్లను ఆశ్రయించి నీరు తెచ్చుకుంటున్నామని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మాజీ సర్పంచ్ పద్మచందర్‌నాయక్ సమస్యను పరిష్కరించే వారన్నారు. ప్రస్తుతం బోరు మరమ్మతులు చేయలేని దుస్థితి ఉందని వాపోయారు. పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారులకు తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదని తండా వాసులు మండిపడుతున్నారు. అధికారులు సమస్యను తీర్చాలంటున్నారు.

ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ జకీర్ అహ్మద్

వికారాబాద్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): హోటళ్లు, రిసార్ట్స్, బేకరీలు, కర్రి పాయింట్లలో ఆహారం విషయాల్లో జాగ్రత్తలు పాటించాలని మునిసిపల్ కమిషనర్ జకీర్ అహ్మద్ అన్నారు. బుధవారం 100 రోజులప్రణాళికలో భాగంగా మునిసిపల్ కార్యాలయంలో బేకరీలు, రిసార్ట్స్, హోటల్స్, నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నిషేధం, ఆన్‌సైట్ కంపోస్టింగ్ విషయంలో నిబంధనలు పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శ్రీనివాస్, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే.. రెవెన్యూ సదస్సులు


యాలాల: దౌలాపూర్‌లో రెవెన్యూ సదస్సులో సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్


మోమిన్‌పేట్: దుర్గం చెరువులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

యాలాల/పరిగి/కులకచర్ల/బొంరాస్‌పేట్/మోమిన్‌పేట్/దౌల్తాబాద్, తాండూరు రూరల్, పూడూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ అన్నారు. బుధవారం యాలాల మండలం దౌలాపూర్ సదస్సులో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, ఆర్‌ఐ వేణు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. రైతులు దరఖాస్తు చేసుకున్న భూ సమస్యలపై పరిశీలించి పరిష్కరిస్తామని పరిగి తహసీల్దార్ ఎం.ఆనంద్‌రావు అన్నారు. బర్కత్‌పల్లి,నస్కల్, రుకుంపల్లి గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో దరఖాస్తులు స్వీకరించారు. డీటీ నవీన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. కులకచర్ల తహసీల్దార్ మనోహరచక్రవర్తి మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు స్వీకరించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య, నాయకుడు గోపాల్‌నాయక్, ఆర్‌ఐలు ఖాజా, రాఘవేంద్రచారి, సిబ్బంది పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. బొంరాస్‌పేట్‌లో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ పద్మావతి, నాయకులు నర్సిములు గౌడ్, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములు, అంజిల్‌రెడ్డి పాల్గొన్నారు. మోమిన్‌పేట మండలం దుర్గంచెరువు రెవెన్యూ సదస్సులో రైతులు నిరసన తెలిపారు. ఏళ్లుగా కబ్జాలో ఉన్నా రికార్డుల్లో నమోదు కాలేదని గోడు వెళ్లబోసుకున్నారు. తహసీల్దార్ రవీందర్ మాట్లాడుతూ.. సమస్యపై దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో శాంతించారు. గ్రామంలో 36దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ సురేశ్‌కుమార్, ఆర్‌ఐ గోవర్ధన్‌గౌడ్, సరిత, అలివేలు, మహేశ్‌గౌడ్, సునీత, మౌనిక, రాజు, పంచాయతీ కార్యదర్శి అనిత పాల్గొన్నారు. దౌల్తాబాద్, అంతారం గ్రామాల్లో తహసీల్దార్ గాయత్రి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. డీటీ చాంద్‌పాషా, సునిల్, నాయకులు బి.వెంకట్‌రెడ్డి, వీరన్న పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. అంతారం సదస్సులో 21 దరఖాస్తులు అందాయని తెలిపారు. డీటీ లలిత, ఆర్‌ఐ గోపి, పీసీ బాలకృష్ణ, సిబ్బంది నరేష్‌కుమార్, ఉలేందర్, రైతులు పాల్గొన్నారు. అంతారం చెరువు అలుగును కబ్జా చేశారని చేసిన ఫిర్యాదుపై తహసీల్దార్ పరిశీలించారు. ఇరిగేషన్ ఏఈ సాయిబన్న, సర్వేయర్ మహేశ్, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్‌కుమార్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పొలాలకు దారి ఇవ్వాలని కబ్జాదారులను ఆదేశించారు. ఆర్డీవో వాసుచంద్ర పూడూరు మండలం మన్నెగూడ సదస్సులో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. భూసమస్యలున్న వారు ఆందోళన చెందకుండా అర్జీలు పెట్టుకోవాలని సూచించారు. పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం


దౌల్తాబాద్: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

మర్పల్లి/దౌల్తాబాద్/ఘట్‌కేసర్ రూరల్/శామీర్‌పేట/తాండూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామాలు, పట్టణాల్లో చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పాలని తల్లిదండ్రులను కోరారు. మర్పల్లిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రిజ్వానా ఆధ్వర్యంలో సిరిపూరంలో 'అమ్మఒడి నుంచి అంగన్‌వాడీలోకి' భాగంగా ర్యాలీ నిర్వహించారు. దౌల్తాబాద్ మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ముస్తాబు చేసి మామిడి ఆకులతో అలంకరించారు. చిన్నారులకు పువ్వులతో స్వాగతం పలికారు. పౌష్టికాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని మేడ్చల్ బి-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్ తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్‌లో జరిగిన అమ్మమాట-అంగన్‌వాడీ బాటలో పాల్గొని చిన్నారులతో కలిసి భోజనం చేశారు. మాజీ సర్పంచ్‌లు బద్దం గోపాల్‌రెడ్డి, నానావత్ రూప్‌సింగ్, అంగన్‌వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. పిల్లల విద్యకు తొలిమెట్టు అంగన్‌వాడీ కేంద్రాలేనని, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు గోగుల సరిత అన్నారు. శామీర్‌పేట మండలం తూంకుంట పరిధి ఉప్పర్‌పల్లికి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శారద ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీని నిర్వహించారు. అంగన్‌వాడీలో పిల్లలను, తల్లుల పేర్లను నమోదు చేశారు. కార్యక్రమంలో ఎంఐవో కమలాకర్, అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, నిర్మల, శకుంతల, రమాదేవి, పావని, సుజాత, లక్ష్మీబాయి, అనురాధ, భూజాత, జ్యోతి, లలిత, వినోద పాల్గొన్నారు. అలాగే తాండూరులోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ సంగీతఠాకూర్ మాట్లాడుతూ చిన్నారులను అంగన్వాడీ సెంటర్‌కు పంపించాలని, పౌష్టికాహారం అందిస్తారని ప్రజలకు తెలిపారు. అడిషనల్ సీడీపీ వో శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ సుశీల, అంగన్వాడి టీచర్ రాధ, హెల్పర్ అనిత, పాల్గొన్నారు.


శామీర్‌పేట మండలంలో అంగన్‌వాడీ బాట కార్యక్రమం

ఉత్సాహంగా ఏరువాక పౌర్ణమి

గ్రామాల్లో ఎద్దులను అందంగా ముస్తాబు చేసి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. వ్యవసాయ పనిముట్లకు పూజలు చేశారు. వానాకాలం ప్రారంభంలో రైతులు నిర్వహించే తొలిపండగ ఏరువాక.


బషీరాబాద్ : నవాల్గలో అలంకరించిన ఎద్దులతో రైతులు


పరిగిలో ఏరువాక పౌర్ణమి వేడుకల్లో స్థానికులు

వైభవంగా పాంబండ గిరి ప్రదక్షిణ

కులకచర్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాంబండ గిరిప్రదక్షిణను బుధవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయం శివనామస్మరణతో మారుమోగింది. ప్రతీ నెల పౌర్ణమి రోజు గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. సౌకర్యాలపై ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో అర్చకులు దశరథం, పాండుశర్మ, అనంతమయ్య, అమరేందర్, కార్యక్రమ నిర్వాహకులు టీచర్ నర్సింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


పాంబండ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

అధ్వానం.. పంట కాలువలు!

(ఐదోపేజీ తరువాయి)

ఎదులాబాద్ వరకు ప్రత్యేకంగా ఈ కాలువను ఏర్పాటు చేశారు. మండలంలో కాలువ 18.5కిలోమీటర్ల మేర ప్రవహిస్తుంది.

పలు చోట్ల ఆక్రమణలకు గురై..

మండలంలోని కాచవనాసింగారం, ప్రతాప్‌సింగారం, సాదత్‌అలీగూడ, మక్తా, కొర్రెముల, వెంకటాపూర్, చౌదరిగూడ, ఎదులాబాద్, పోతరాజిగూడ, కొత్తగూడ గ్రామాల రైతులకు నారాయణరావు చానెల్ కాలువ ద్వారా సాగునీరు అందుతుంది. ఈ కాలువకు గత కొన్నేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో చెత్తాచెదారం, గుర్రపుడెక్కతో నిండిపోయింది. వెంకటాపూర్ వద్ద కాలువపై నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. అది ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సీజన్‌లో వరికోతలు పూర్తికాగానే రైతులు గ్రామాల వారీగా కాలువల్లో ఉన్న చెత్తను తొలగిస్తూ కాలువలను శుభ్రం చేస్తారు. నారాయణరావు కాలువపై కొన్నిచోట్ల పైకప్పులు కూలిపోగా మరి కొన్ని చోట్ల ఆక్రమణలకు గురై బక్కచిక్కింది.


ముత్వేల్లిగూడ వద్ద కాలవపై విద్యుత్‌స్తంభం వేసి రాకపోకలు సాగిస్తున్న రైతులు

పట్టించుకోని అధికారులు

కాచవానిసింగారంలో నారాయణరావు కాలువపై కప్పు విరిగిపోవడంతో విద్యుత్ స్తంభాలను వేసి రాకపోకలు సాగిస్తున్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో 6వేల ఎకరాల్లో వరి, పశుగ్రాసం(ప్యారగడ్డి) సాగు చేస్తున్నారు. పొలం పనులకు కాలువ దాటలేక రైతులు అవస్థలు పడుతున్నారు. పదేళ్ల నుంచి నం ఘాల్లేక అధికారులే నారాయణరావు కాలువ, చిన్న కాలువ, పాతకత్వ నిరహ్వణ చేపడుతున్నారు. కాలువ మరమ్మతులు చేపట్టి సాగునీరందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

త్వరలోనే మరమ్మతులు పూర్తి చేస్తాం

నారాయణరావు కాలువ మరమ్మతులు చేపట్టాం. పెరుగుతాయి. కాలువ శుభ్రం చేసుకుంటే సాగునీరు సజావుగా వస్తది. పైకప్పుల నిర్మాణానికి నివేదికలు సిద్ధం చేశాం. త్వరలో కాలువ మరమ్మతులు చేస్తాం.

- అరిగే పరమేశ్, ఇరిగేషన్ ఏఈ

మోగిన బడి గంట!


మోమిన్‌పేట మండలం టేకులపల్లి పాఠశాలకు తోరణాలు కడుతున్న గ్రామస్థులు

(ఐదోపేజీ తరువాయి)

అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద జిల్లాలో 954 పాఠశాలల్లో రూ.27 కోట్లతో విద్యుద్దీరణ, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతులు, తాగునీటి సదుపాయం వంటి పనులు చేపట్టారు. పీఎం శ్రీ పథకం కింద జిల్లాలో మొదటి విడతలో ఎంపిక చేసిన 30 పాఠశాలల్లో రూ.2 కోట్లతో అవసరమైన వసతులు కల్పించడమే కాకుండా విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టారు. విద్యా బోధనలో వినూత్నంగా ఉండేందుకు గత ఏడాది 225 పాఠశాలలకు 712 ఐఎఫ్‌పీ ప్యానెళ్లు, 940 పాఠశాలలకు 3,187 గ్రీన్ చాక్ బోర్డులు, 842పాఠశాలలకు 23,559 డ్యూయెల్ డెస్కులు సరఫరా చేశారు.

పెచ్చులూడిన చోట మరమ్మతులు

ఇదిలా ఉంటే, జిల్లాలో పెచ్చులూడిన పాఠశాలలకు మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. జిల్లాలో 331 పాఠశాలల్లో తరగతి గదులు పెచ్చులూడినట్లు గుర్తించారు. ఈ పాఠశాలలకు వెంటనే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉన్నట్లు ఇంజనీరింగ్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పనులు చేపట్టేందుకు రూ.1.08 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ప్రమాదకరంగా మారిన తరగతి గదులకు మరమ్మతులు చేపట్టేందుకు అంచనా వ్యయంతో 25 శాతం నిధులు మంజూరు చేశారు.

పాఠశాలలకు చేరిన పాఠ్య పుస్తకాలు

ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో 5,27,030 పాఠ్య పుస్తకాలు(పార్ట్-1) సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 98 శాతం పుస్తకాలు వచ్చాయి. ఇంతవరకు జిల్లాకు 4,81,511 పాఠ్య పుస్తకాలు రాగా, వాటిని పాఠశాలలకు చేర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. కాగా, 8, 6వ తరగతుల హిందీ పుస్తకాలు సరఫరా కావాల్సి ఉంది. ఈ ఏడాది ఇప్పటి వరకు 1,23,329 వర్క్‌బుక్‌లు రావాల్సి ఉండగా, 40శాతం సరఫరా అయ్యాయి. 20వ తేదీలోగా లక్ష్యం మేరకు సరఫరా చేయనున్నట్లు తెలిసింది. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసే 5,79,894 నోట్ పుస్తకాలను నేరుగా స్కూళ్లకు చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

సిద్ధంగా విద్యార్థుల యూనిఫాం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 79,049 యూనిఫాం దుస్తులను సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంత పాఠశాలలకు సంబంధించి యూనిఫాం దుస్తులు 94.31 శాతం సిద్ధం కాగా, పట్టణ ప్రాంత పాఠశాలలకు 97.48శాతం యూనిఫాం దుస్తులు సిద్ధం చేశారు. సిద్ధమైన యూనిఫాం దుస్తులను పాఠశాలలకు పంపించేలా చర్యలు చేపట్టగా, కొన్ని మండలాల్లో ఇప్పటికే యూనిఫాం పంపిణీ ప్రారంభించారు. ఒక విద్యా సంవత్సరంలో ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫాం ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తున్నారు.

ఈ ఏడాదైనా మెరుగు పడేనా?

కొత్త విద్యా సంవత్సరంలోనైనా విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ పెరిగి విద్యార్థుల చదువులు మెరుగు పడుతాయన్న ఆశాభావం విద్యార్థుల తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. వరుసగా మూడు సంవత్సరాలుగా పదో తరగతి పరీక్షల్లో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలో చివరి స్థానంలో నిలుస్తున్న విషయం తెలిసిందే. ఈ సంవత్సరమైనా విద్యార్థుల చదువులపై ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తేనే మెరుగు పడే అవకాశం ఉంటుంది. గతేడాదితో పోలిస్తే జిల్లాలో పలు పాఠశాలలకు కొత్త ఉపాధ్యాయులు రాగా, మండలాల్లో పాఠశాలల పనితీరును పర్యవేక్షించేందుకు సీనియర్ జీహెచ్‌ఎంలకు ఎంఈవో బాధ్యతలు అప్పగించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు విద్యార్థుల చదువులు మెరుగు పడేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది తెలియాలంటే వేచి చూడాల్సిందే.

మేడ్చల్‌లో మామిడి తోరణాలతో ముస్తాబు

మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్వాగతం పలికేందుకు బుధవారం ఏర్పాట్లు చేశారు. పాఠశాలలను శుభ్రం చేసి తరగతి గదులను అందంగా తీర్చిదిద్దారు. గదులకు, గేట్లను మామిడి తోరణాలతో అలంకరించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు స్వాగతఏర్పాట్లు చేశారు. మరుగుదొడ్లు, వంట గదులను శుభ్రం చేసి పాఠశాల ఆవరణలో చెత్తా లేకుండా ఊడ్చారు. పాఠశాలల్లో అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని, ప్రత్యేక తరగతులు, దుస్తులు, పుస్తకాలు ఉచితంగా అందిస్తోందని ఉపాధ్యాయులు బడిబాటలో ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజునే యూనిఫాం, పుస్తకాలు అందించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఆయా పాఠశాలలకు పుస్తకాలను చేరాయి.

ఈ ఏడాది నుంచి యోగా, ధ్యానం

- గ్రీన్ అవర్, బాల సభలు

తాండూరు: నేటి నుంచి ప్రారంభమయ్యే ప్రభుత్వ పాఠశాలలో ఈ ఏడాది విద్యాశాఖ పలు సంస్కరణలను చేపడుతోంది. పాఠశాలల్లో ఉదయం ప్రార్థన(అసెంబ్లీ) ముగిసిన తర్వాత ప్రతీరోజు 5 నిమిషాల పాటు విద్యార్థులకు యోగా, ధాన్యం చేయించాలని విద్యాశాఖ ఆదేశాలిచ్చింది. ప్రతీ నెల మూడో శనివారం తల్లిదండ్రులు, టీచర్ల సమావేశం(పీటీఎం) నిర్వహించనున్నారు. గ్రీన్ అవర్, బాల సభలు నిర్వహించడంతోపాటు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఏఏపీసీ) సభ్యులను కార్యక్రమాలకు పిలవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలలవిద్యార్థులకు సైతం ఈ ఏడాది రాత పుస్తకాలు(నోట్ బుక్స్) అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, తాండూరు నియోజకవర్గంలో తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండలాలకు ఇన్‌చార్జి మండలాల విద్యాధికారులే కొనసాగుతున్నారు.

సంక్షిప్తంగా..

- **మోమిన్‌పేట్:** విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మేకవనంపల్లి జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం గౌరీశంకర్ అన్నారు. బుధవారం గ్రామాల్లోని పాఠశాలల్లో భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. గురువారం నుంచి పాఠశాలలు పునప్రారంభం అవుతున్న దృష్ట్యా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌పీలు నగేశ్, నరేశ్, శ్రీనివాస్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.
- **తాండూరు రూరల్:** సంగెంకలాన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి డీసీసీబీ వైస్‌చైర్మన్ రవీందర్‌గౌడ్, ఎంపీడీవో విశ్వప్రసాద్ భూమిపూజ చేశారు. పేదల సొంతింటిక నెరవర్చేడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో సంగెంకలాన్‌కు 50 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. అధికారుల సమక్షంలో ఇళ్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌజింగ్ ఏఈలు రహీం, అన్సారీ, మాజీ సర్పంచ్ మేఘనాథ్, గ్రామ పెద్దలు అమర్‌నాథ్‌గౌడ్, యువకులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.
- **తాండూరు:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, నియోజకవర్గ కార్యకర్తలు కలిసి సంఘీబావం తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా కేసీఆర్‌ను ఏమీ చేయలేరని రోహిత్‌రెడ్డి వాఖ్యనించారు. కార్యక్రమంలో తాండూరు పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అప్పు, సీనియర్ నాయకులు శ్రీనివాస్ చారి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- **కులకచర్ల:** కాంగ్రెస్‌తోనే నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతుందని కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ అన్నారు. తిరుమలాపూర్‌లో ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందించారు. కార్యక్రమంలో నాయకులు నర్సిములుగౌడ్, పంచాయతీ కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- **కొడంగల్:** పేదల ఇంటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్ అన్నారు. ఇందనూర్‌లో మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందించారు. అర్హులందరికీ విడతల వారీగా ఇళ్లు మంజూరు అవుతాయని తెలిపారు. నాయకులు సంజీవ్‌రెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.
- **నవాబుపేట:** మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎండీ.ఇక్బాల్‌ను నియమించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఎమ్మెల్యే యాదయ్య ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డిని కలిసి విన్నవించారు.

క్రైం కార్నర్

అత్తను చంపిన అల్లుడు


నిందితుడు దొరబాబు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లి అమ్ముకున్నందుకు మందలించిన అత్తపై అల్లుడు పగపెంచుకొని గొంతు నులిమి హత్య చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైసమ్మగుట్ట కాలనీకి చెందిన మంజుల అంబన్న, బుజ్జమ్మ(40) దంపతులకు ముగ్గురు కూతుళ్లు. రెండో కూతురు గీతకు ఐదేళ్లక్రితం శేరిలింగంపల్లికి చెందిన శాంతాల దొరబాబు(30)తో పెళ్లి చేశారు. దొరబాబు రెండేళ్ల నుంచి అత్తగారింటి పక్కనే ఉంటూ స్టోన్‌వర్క్ చేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం దొరబాబు బుజ్జమ్మ సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లి రూ.1,500కు అమ్మి మద్యం తాగాడు. అత్త, అల్లుడికి మధ్య గొడవ జరిగింది. ఆమెపై దొరబాబు పగపెంచుకున్నాడు. మంగళవారం భార్య, మరదలు వేరే ఊరికి వెళ్లారు. దొరబాబు బుధవారం తెల్లవారుజామున బయటి నుంచి ఇంటికి రాగా అత్త ఒక్కరే ఉండడం చూసి ఆమె ముఖంపై దిండుపెట్టి, గొంతు నులిమి చంపేశాడు. ఉదయం వచ్చిన కూతుళ్లు తల్లిని విగత జీవిగా చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆధారాల సేకరించి దొరబాబును అదుపులోకి తీసుకున్నారు. తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. తనతో తరచూ గొడవప డుతుందనే చంపినట్లు విచారణలో తేలింది. బుజ్జమ్మ చిన్న కూతురు గౌరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పరశురాం తెలిపారు.

రైలుకిందపడి వ్యక్తి ఆత్మహత్య


నర్సింగ్‌రావు మృతదేహం

ఘట్‌కేసర్ రూరల్, జూన్11(ఆంధ్రజ్యోతి): రైలుకు ఎదురెళ్లి వెళ్లి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాజిపేట్-సికింద్రాబాద్ వెళ్తున్న రైలుకు ఎదురుగా వెళ్లిన ఓ వ్యక్తి (36)ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంజన్‌కు చిక్కుకొని అర కిలోమీటర్ వరకు లాక్కుపోగా మృతి చెందాడు. లాకో పైలట్ రైలును ఘట్‌కేసర్ స్టేషన్‌లో నిలిపి పోలీసులకు సమాచారమిచ్చాడు. రైల్వే పోలీసులు శ్రమించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు ఎదులాబాద్‌కు చెందిన నీరుడి నర్సింగ్‌రావుగా గుర్తించారు. అతడు డ్రైవింగ్ పనిచేస్తుంటాడని తెలిపారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతడు మద్యానికి బానిసైనట్లు తెలుస్తోంది.

మహిళను చంపిన ఇద్దరికి రిమాండ్


కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

పరిగి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): దొంగతనానికి ఓ ఇంట్లోకి వెళ్లి తల్లి, కొడుకులను రాడ్డుతో కొట్టి మహిళ మృతికి కారణమైన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసిన రిమాండ్‌కు తరలించినట్లు పరిగి డీఎస్పీ ఎస్.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. రాపోల్‌కి చెందిన పొట్టి రాంచరణ్(20) జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు చేస్తున్నాడు. అతడు రాపోల్‌లోని గండు రాజేందర్ ఇంట్లో గతంలో పలుమార్లు చోరీలు చేశాడు. పదిరోజుల సెల్‌ఫోన్ తస్కరించాడు. మంగళవారం అర్ధరాత్రి రాజేందర్ ఇంట్లో చొరబడగా రాజేందర్ మెల్కొని అరిచాడు. దీంతో రాంచరణ్ పారిపోయాడు. రాజేందర్ తనను చూశాడు కాబట్టి ఊర్లో అందరికీ చెప్తాడని రాంచరణ్ విషయాన్ని స్నేహితుడు గండు చంద్రశేఖర్, మరో బాలుడితో అన్నాడు. రాజేందర్‌ను చంపాలని అనుకున్నారు. కత్తి, ఇనుపరాడ్లతో మంగళవారం రాత్రి రాజేందర్ ఇంట్లో చొరబడి దాడిచేశారు. రాజేందర్‌ను కొట్టొద్దని అడ్డుకున్న అతడి తల్లి నర్సమ్మపైనా దాడిచేయడంతో ఆమె మృతి చెందింది. గాయాలైన రాజేందర్‌ను ఆస్పత్రికి తరలించారు. రాజేందర్ ఫిర్యాదు మేరకు పోలీసుల విచారణ చేసి రాంచరణ్, అతడికి సహకరించిన చంద్రశేఖర్, మరో మైనర్‌పై కేసు నమోదు చేశారు. ఇద్దరిని బుధవారం రిమాండ్‌కు తరలించారు. మరోవ్యక్తి పరారీలో ఉన్నాడని తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై ఎం.సంతోష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి.. భార్యకు గాయాలు

బొంరాస్‌పేట్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతిచెందగా భార్యకు గాయాలైన సంఘటన మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వరంగల్ జిల్లాకు చెందిన కె.వెంకటేశ్వర్‌రావు, భార్య కల్యాణి మంగళవారం దత్తాత్రేయస్వామి దర్శనం కోసం ఘన్‌గాపూర్‌కు కారు(ఏపీ 20 ఏబీ 822-870)లో బయలుదేరారు. అర్ధరాత్రి భోజన్నగడ్డ తండా ఇటుక బట్టీల వద్ద హైవేపై ఎదురుగా వచ్చిన డీసీఎం(కేఏ28 సీ1473)ఢీకొట్టగా కారులోని వెంకటేశ్వర్‌రావు మృతిచెందాడు. కల్యాణికి గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్వర్‌రావు సోదరుడు పాండు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

అనుమతి లేని భవనంలో పాఠశాల



అనుమతి లేకుండా నిర్మించిన భవనం

పెద్దేముల్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా నిర్మించిన ఓ భవనంలో పాఠశాల కొనసాగుతోంది. ఐదేళ్లుగా పాఠశాల కొనసాగుతున్నా అధికారులు, పంచాయతీ అధికారులూ పట్టించుకోలేదు. పెద్దేముల్‌లో ఓ వ్యక్తి కొన్ని రేకులతో కొన్ని గదులు నిర్మించాడు. అదే భవనంలో శ్రీవాణి విద్యామందిర్ పేరుతో పాఠశాల కొనసాగుతోంది. ఇటీవలే పంచాయతీ కార్యదర్శిగా వచ్చిన లాలప్ప విషయం గుర్తించి భవన యజమానికి ఏప్రిల్ 22న నోటీసులిచ్చారు. అందుకు యజమాని పది రోజుల గడువుకోరారు. ఇప్పటికీ అనుమతులు తీసుకోలేదు. మరి అనుమతిలేని భవనంలో కొనసాగే పాఠశాలతో విద్యా సంవత్సరం కొనసాగుతుందా? విద్యార్థుల పరిస్థితి ఏమిటి? అని తల్లిదండుతున్న ఆందోళన చెందుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి లాలప్ప స్పందిస్తూ.. శ్రీవాణి విద్యామందిర్ పాఠశాల కొనసాగుతున్న నిర్మాణానికి అనుమతుల్లేవన్నారు. ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు. మరో నోటీసు ఇస్తాం అన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి


రాములు (ఫైల్)

కొడంగల్ రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మండలంలోని టేకుల్‌కోడ్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ రాములు మంగళవారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. యూత్ కాంగ్రెస్ జాతీయ కో-ఆర్డినేటర్ యం.కృష్ణంరాజు బుధవారం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి తన వంతుగా ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవ సేవే... మాధవ సేవ



కీసర, జూన్11(ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవ అని ఓ మౌజయాః ఆశ్రమ నిర్వాహకులు శ్రీరుషి ప్రజ్ఞానంద స్వామీజీ అన్నారు. బుధవారం పౌర్ణమి సందర్భంగా నాగారం పరిధి కరీంగూడలోని ఆశ్రమం వద్ద అన్నదానం చేశారు. నిరుపేదలకు సేవ చేస్తున్నామని, ఆశ్రమం తరపున రాష్ట్రంలోని పలు జిల్లాలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మరిన్ని చేయడానికి కృషిచేస్తున్నట్లు ఆశ్రమం నిర్వాహకులు తెలిపారు.